క్లుప్తంగా

కేంద్రమంత్రిని కలిసిన కమిషన్ సభ్యులు

గోదావరిఖని: కేంద్ర కార్మిక ఉపాధి శాఖ, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్‌మాండవీయను జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌజ్‌లో కలిశారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, టీఎస్‌జెన్‌కో ఇతర విభాగాల్లోని కార్మికులకు సకాలంలో పూర్తి వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. హైదరాబాద్‌లో యువతకు ఉద్యోగ అవకాశాల కోసం రోజ్‌గార్ యోజనను బలోపేతం చేయడంపై అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. దీని కోసం ఒక కమిటీని నియమించాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం



హోమం పూజలో భక్తులు

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధి శాలపల్లి గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చొప్పదండి మండలం రుద్రారంకు చెందిన ప్రముఖ వేదపండితుడు విష్ణువర్ధనాచార్యులు ఆధ్వర్యంలోని స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, హోమం చేశారు. అనంతరం ఆలయ కమిటీవారు భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు.

కొనసా..గుతున్న పనులు



నత్తనడకన సాగుతున్న పనులు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో చిరు వ్యాపారుల్లో ఆవేదన వ్యక్తమవుతుంది. రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం నాటికి స్టేషన్ ఎదుట కూడలి సుందరీకరణ పనుల్లో భాగంగా చిరు వ్యాపారుల షెడ్లను ఎత్తివేయాలని ముందుగా నిర్ణయించారు. ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్ పనులు నిలిచిపోవడంతో ఎప్పుడు పూర్తవుతాయోనని వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమీక్షించాలని కోరుతున్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని అన్ని రేషన్ షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని గురువారం బీజేపీ నాయకులు తహసీల్దార్ వాసంతికి వినతిపత్రాన్ని అందజేశారు. దేశవ్యాప్తంగా గరీబ్ కల్యాణ్ యోజన పథకం ద్వారా ఉచిత రేషన్ బియ్యం కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని, ప్రతీ రేషన్ షాపులో పీఎం చిత్రపటం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు కోయ్యడ సతీశ్, నాయకులు మట్ట శంకర్, జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్‌కుమార్, బర్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లో రెండు కార్లు ఢీకొన్నాయి. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని రోడ్డుపై రెండు కార్లు ఢీకొనడంతో ఓ కారు బోల్తా పడగా మరో కారు రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. ప్రమాదంలో ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. బోల్తాపడిన కారు ఎన్టీపీసీ అధికారికి అద్దె ప్రాతిపదికన కొనసాగుతోంది. మరో కారు గోదావరిఖని ప్రాంతానికి చెందిన వ్యక్తిగా తెలిపారు. ప్రమాదానికి అధిక వేగమే కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

సుందిళ్లలో కాంగ్రెస్ యాత్ర



యైటింక్లయిన్‌కాలనీ: బీజేపీ అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాపు.. జైభీం..జై సంవిధాన్.. అభియాన్‌లో భాగంగా గురువారం రామగిరి మండలం సుందిళ్లలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దుద్దిళ్ల శ్రీనుబాబు పాదయాత్ర చేపట్టారు. ముందుగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, చంద్రయ్య, పోశం, దేవక్క, మహేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన 'ఆట'



కీచులాటపల్లెలో మక్క చేనువద్ద క్రీడా ప్రాంగణ బోర్డు



కుమ్మరికుంట పంచాయతీ భవనంలో సజ్జపై క్రీడాసామగ్రి

- నిరుపయోగంగా గ్రామీణ క్రీడా ప్రాంగణాలు
- మూలకుపడిన క్రీడాసామగ్రి
- వినియోగంలోని తేవాలంటున్న యువకులు

జూలపల్లి: గ్రామీణ యువత క్రీడల్లో నైపుణ్యం పెంచుకునేందుకు ఐదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇందుకు అవసరమైన నిధులను ఈజీఎస్ పథకంలో చేర్చి పంచాయతీలకు నిర్వహణ బాధ్యతను అప్పగించారు. మండల కేంద్రంతో పాటు 13 పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు, వివిధ క్రీడల సామగ్రికి రూ.6.9 లక్షలు వెచ్చించారు. ఆట వస్తువుల కిట్లను గ్రామపంచాయతీలకు అప్పగించారు. ఈనేపథ్యంలో యువకులకు ఆటలు ఆడుకునేందుకు పంచాయతీ సిబ్బంది క్రీడా వస్తువులు ఇచ్చి, వారు ఇంటికి వెళ్లే సమయంలో మళ్లీ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఆచరణలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. గ్రామాల్లో స్థలాలు లేక ప్రభుత్వం అందించిన బోర్డులను ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేశారు. క్రీడల కిట్లను ఎవరికీ ఇవ్వకుండా మూలనపడేశారు. పంచాయతీల్లో క్రీడల కిట్లు ఉంటాయని యువకులకు తెలియకుండా పోయింది. దీంతో క్రీడా సామగ్రి నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా లక్షల రూపాయలు వృథా అయ్యాయి. ఇప్పటికైనా స్థలాలు ఉన్న గ్రామాల్లో క్రీడా వస్తులను ఇచ్చి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

యువకులను ప్రోత్సహించాలి



యువకులు క్రీడల్లో నైపుణ్యం పెంచుకునేందుకు ప్రోత్సాహం అందించాలి. పట్టణ యువతకు దీటుగా క్రీడల్లో రాణించేందుకు గ్రామీణ క్రీడా ప్రాంగాణాలను ఉపయోగంలోకి తీసుకురావాలి.

– బొమ్మెనవేని సతీశ్, వాలీబాల్ క్రీడాకారుడు, అబ్బాపూర్

అందుబాటులోకి తెస్తాం

గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తెస్తాం. ఆటలు ఆడుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటాం. గ్రామపంచాయతీలకు నిధులు రాగానే క్రీడా స్థలాలను తీర్చిదిద్ది యువకులు ఆటలు ఆడుకునేలా చూస్తాం.

– అనిల్‌రెడ్డి, ఎంపీవో

మార్పులు చేయడం హర్షణీయం



డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీతారామయ్య

గోదావరిఖని: కాంట్రాక్ట్ కార్మికుల గైర్హాజరు పెనాల్టీ విధానంలో యాజమాన్యం మార్పులు తీసుకురావడం హర్షణీయమని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఇదే విధంగా ఉండాలని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. గురువారం సంస్థ డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పాత పద్ధతులే కొనసాగుతున్నాయని, మారుతున్న పరిస్థితులకనుగుణంగా కొన్ని మార్పులు తీసుకురావాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో 25% వరకు గైరాజరైనప్పటికీ పెనాల్టీ ఉండదని, దీనివల్ల కాంట్రాక్ట్ కార్మికులపై ఒత్తిడి తగ్గుతుందని, మార్పులను కేవలం సివిల్ డిపార్ట్‌మెంట్‌తో పాటు పర్చేజ్, ఫారెస్ట్ విభాగంలో కూడా వర్తింపచేయాలన్నారు. రెగ్యులర్‌గా నడిచే టెండర్‌లను గ్యాప్ లేకుండా కంటిన్యూ చేయాలన్నారు. వివిధ సమస్యలపై డైరెక్టర్(పా) సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. సీతారామయ్య వెంట నాయకులు కృష్ణయ్య, కృష్ణ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అణచివేత అంతానికి పోరాడుదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: సమాజంలో సామాజిక అణచివేతపై పోరాటం సాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. సుల్తానాబాద్ రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ సమావేశం పూసాల పెద్దమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో అన్ని రకాల దోపిడీ, అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, పెట్టుబడిదారి సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సీఐటీయూ పనిచేస్తుందన్నారు. కార్పొరేట్, మతోన్మాద విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేస్తూ మే 20న దేశవ్యాప్తంగా సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజయ్య, నొండ్ల బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలు

- ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్ రావు



మాట్లాడుతున్న జీఎం ఎన్.సుధాకర్ రావు

రామగిరి: సమిష్టి కృషితోనే ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించామని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్ రావు అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆర్జీ–3 ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు గురువారం ఓసీపీ–2 గని ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొని అధికారులు, కార్మికులను అభినందించారు. లక్ష్యసాధనలో ప్రోత్సాహం అందిస్తున్న సీఅండ్ఎండీ బలరాంనాయక్, రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పాడాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రా రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ప్రాజెక్టు అధికారి సీ.హెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ కేవీ.రామరావు తదితరులు పాల్గొన్నారు.

'సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిది'



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

సుల్తానాబాద్: సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మాజీ అధ్యక్షుడు కదారి అశోక్‌రావు గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.40 కేటాయిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది ఎంతో తెలపాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వలె కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని, యూనివర్సిటీ భూములు కాపాడాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్యకర్తలపై లాఠీచార్జి చేయడం సమంజసం కాదన్నారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాలకు చివరి తడి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈనెల 4న గోదావరిఖని పట్టణంలోని శారదనగర్ సరస్వతి శిశుమందిర్‌లో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తామని, గ్రామ, పట్టణ, మండల అధ్యక్షులతో పాటు నాయకులు హాజరుకావాలని కోరారు. కూకట్ల నాగరాజు, సాదరి మహేందర్‌యాదవ్, నాగులమల్యాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు చిలుక శంకర్ డిమాండ్ చేశారు. ఈనెల 8న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ప్రజాధర్నా పోస్టర్‌ను గురువారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీ జాతి హననానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎడతెగని విధంగా హత్యాకాండకు తెగబడుతున్నాయని ఆరోపించారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీ జాతిని హతమారుస్తున్న విధానాన్ని దేశంలోని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకించి ఖండించాలన్నారు. అడవుల్లో అపారమైన ఖనిజ సంపద, వనరులను రక్షించేందుకు పోరాడుతున్న అడవి బిడ్డలకు కొండంత అండగా నిలబడుదామని పేర్కొన్నారు. మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బుచ్చన్న, పుట్టపాక స్వామి, కుమార్, రాజయ్య, రవి, రాయమల్లు, చందు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్



పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ బీజేపీ నాయకులను గోదావరిఖని టూటౌన్ పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చలో హెచ్‌సీయూ కార్యక్రమానికి తరలివెళ్తున్నారన్న సమాచారం మేరకు ముందస్తుగా కాలనీ బీజేపీ నాయకులు ఆకుల శశికుమార్, అనిల్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హెచ్‌సీయూ భూములు కాపాడేందుకు పోరాటం చేస్తున్న విద్యార్థుల అక్రమ అరెస్టులు, వారిపై లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూముల వేలాన్ని ఆపి హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన కోరుకంటి



గోదావరిఖని: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం కలిశారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ సమావేశంలో పాల్గొన్నారు.

నేడు సన్న బియ్యం పంపిణీ

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ పథకాన్ని బసంత్‌నగర్‌లో శుక్రవారం ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక రేషన్ దుకాణం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరౌతారన్నారు.

రాహుల్‌గాంధీని కలిసిన రాజ్‌ఠాకూర్



గోదావరిఖని: పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ గురువారం కలిశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ నేతృత్వంలో మంత్రి కొండా సురేఖ, బీసీ ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని కలిశారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ నాయకులు

రామగిరి: ఏపీఏ గనిలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని బీఎంఎస్ నాయకులు ప్రసాద్, రమేశ్ కోరారు. గురువారం ఏపీఏ మేనేజర్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, సంతోష్, సురేశ్, వెంకటసాయి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన దేవి రాజనర్సింగ్ అనారోగ్యంతో మృతిచెందగా తోటి పూర్వ విద్యార్థులు రూ. 57,500 చెక్కును కుటుంబసభ్యులకు అందించారు. మేడారం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన రాజనర్సింగ్ మృతిచెందాడు. దీంతో 1991–92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు చెక్కును మృతుడి భార్యకు అందించారు. ఇక్కడ పూర్వవిద్యార్థులు కన్నా తిరుపతి, కాంపెల్లి రాజేశం, సమాంతుల రాజమల్లు, నర్సింగం, మిట్ట తిరుపతి, పెంచికల సత్యనారాయణ, వేల్పుల మల్లేశం తదితరులున్నారు.

దాడి కేసులో ఒకరు అరెస్ట్



గాయపడిన సురేశ్

ముత్తారం: ఖమ్మంపల్లిలో దాడి ఘటనలో గురువారం తీర్థల కొమురెల్లిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై గోపతి నరేశ్ తెలిపారు. ఈనెల 1న ఇంటి స్థలం వద్ద తీర్థాల సురేశ్, రాకేశ్‌పై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కొమురెల్లిని కోర్టులో హాజరుపరిచామన్నారు. కరీంనగర్ జైలుకు తరలించామని చెప్పారు.

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్‌లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రోబోటిక్ ఆర్టిఫీషియల్ ఇంటిలీజెన్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బాట్‌లైవ్ టెక్నాలజీస్ ప్రైవేట్‌లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించామని విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ప్రయాణికులకు అందుబాటులో బస్‌షెల్టర్

జ్యోతినగర్: ప్రయాణికుల కష్టాలను ట్రాఫిక్ పోలీసులు తీర్చి ప్రజలకు బస్‌షెల్టర్ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు, ఎస్సై హరిశేఖర్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ రాజీవ్ రహదారి వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికులు ఎండలో నిలబడకుండా నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్‌ను హెచ్‌కేఆర్ ద్వారా ఉపయోగంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రయాణికులు బస్‌షెల్టర్ వద్ద బస్ కోసం వేచి ఉండాలని, రోడ్డుపై ఉండకూడదన్నారు.

ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి

సుల్తానాబాద్: రైస్‌మిల్లులపై అధికారులు ఆకస్మిక తనిఖీలు రెగ్యులర్‌గా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ కదారి సునీల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మాట్లాడారు. జిల్లాలోని రైస్‌మిల్లులు, ఇటుక బట్టీల్లో నిబంధనలకు విరుద్ధంగా వలస కార్మికులకు అతి తక్కువ కూలి ఇచ్చి వారితో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. రైస్‌మిల్లుల్లో గంజాయి మొక్కలు పెంచుతూ కార్మికులను మత్తులో ముంచి వారి శ్రమ దోపిడీ చేస్తున్నారని, స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌తో సోదాలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

పండుగ పూట ఇల్లు కూల్చడం దారుణం



మాట్లాడుతున్న రాజయ్య, రమేశ్‌గౌడ్

పెద్దపల్లిరూరల్: ఉగాది పండగ రోజున పూజలు చేసుకుంటున్న వృద్ధ దంపతుల ఇంట్లోకి చొరబడి వారి సామగ్రిని రోడ్డుపై పడేసి జేసీబీతో ఇల్లు కూల్చడం అన్యాయమని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్య, టీపీసీసీ ప్రచార కార్యదర్శి బి.రమేశ్‌గౌడ్ అన్నారు. న్యాయస్థానం తీర్పు తమకనుకూలంగా ఉందంటూ కొందరు పట్టణంలోని భూంనగర్‌లోని దేవరకొండ సత్యనారాయణ ఇంటిని ఉగాది రోజున కూల్చివేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యేను బద్నాం చేసేలా కాల్వశ్రీరాంపూర్ మండల మాజీ జెడ్పీటీసీ సారయ్యగౌడ్, ఇంకా కొందరు నేతలు వ్యవహరించడం సరికాదన్నారు. నాయకులు తూముల శ్రీనివాస్, అక్కపాక నరేశ్, కట్ట సదానందం, కట్ట రాజానందం తదితరులున్నారు.

కార్మికుల శ్రమ దోపిడీతోనే రూ.510కోట్ల లాభాలు



మాట్లాడుతున్న అంబటి నరేశ్

గోదావరిఖని: కార్మికుల శ్రమ దోపిడీతోనే ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ రూ.510కోట్లు లాభాలు ఆర్జించిందని మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికుల రక్తాన్ని దారపోసి లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి చేసినా.. యాజమాన్యం వారి శ్రమను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల జీతభత్యాలపై డిక్లరేషన్ ఇవ్వకుంటే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. నాయకులు రూపేశ్, క్రాంతి, రమేశ్, సతీశ్, శ్రీనివాస్, రాము, ప్రవీణ్, సతీశ్, శ్రీకాంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై దాడి.. అధికార దుర్వినియోగం

జ్యోతినగర్: విద్యార్థి హక్కులపై దాడి, అధికార దుర్వినియోగం వెంటనే మానుకోవాలని బీజేపీ ఎన్టీపీసీ రామగుండం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్, హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు గోలివాడ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం ఎన్టీపీసీ పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన అనంతరం వారు మాట్లాడారు. చలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి వెళ్తారనే సమాచారంతో అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. క్యాంపస్‌లో 400 ఎకరాల భూమిని ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయగా లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. ప్రభుత్వం వేలాన్ని నిలిపివేసి యూనివర్శిటీ భూములను పరిరక్షించాలని అన్నారు.

సమస్యలు పరిష్కరించండి



వినతి పత్రం అందజేస్తున్న శంకర్‌నాయక్

గోదావరిఖని: వందశాతం బొగ్గు ఉత్పత్తికి సహకరించామని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు బదావత్ శంకర్‌నాయక్ కోరారు. గురువారం ఓసీపీ–3 బేస్‌వర్క్‌షాప్‌లో హెచ్‌వోడీ విజయ్‌కుమార్, మేనేజర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాలిగామ మల్లేశ్, బ్రాంచ్ సెక్రటరీ తోకల సమ్మయ్య, నాయకులు కర్క శ్రీనివాస్‌రెడ్డి, బర్ల రవీందర్, కొంగర రవీందర్, వాసాల అశోక్, భానోత్ జాన్, పోచంపల్లి మధు, సుదర్శన్ రెడ్డి, తోకల సమ్మయ్య పాల్గొన్నారు.

నేడు మంత్రి దుద్దిళ్ల పర్యటన

మంథని: మంథని నియోజకవర్గంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం పర్యటించనున్నారు.ఎకాటారం, మహాముత్తారం, మల్హర్, మాహాదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాటారం బీఎల్ఎం గార్డెన్‌లో ప్రారంభిస్తారు. రాత్రి మంథనిలోని శివ కిరణ్ గార్డెన్‌లో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాలకు సంబంధించిన బియ్యం పంపిణీని ప్రారంభిస్తారని మంత్రి కార్యాలయ పీఏ చంద్రశేఖర్ పేర్కొన్నారు.